

## మారుతి
# కొత్త కార్లు వచ్చేస్తున్నాయి..
### 2025లో నాలుగు కార్లను విడుదల చేయనున్న సంస్థ

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ టాప్ గేర్‌లో దూసుకుపోతున్నది. ఇప్పటికే కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్న సంస్థ..కొత్త ఏడాదిలో నయా మాడళ్లను విడుదల చేయబోతున్నది. ఢిల్లీ వేదికగా జరగనున్న వాహన పండుగలో ఈ కొత్త మాడళ్లను ప్రదర్శిస్తున్నది. వీటిలో తొలి ఎలక్ట్రిక్ వాహనంతోపాటు మూడు ఎస్‌యూవీ మాడళ్లు ఉన్నాయి. వీటి వివరాలు..

**మారుతి ఈ-విటారా:**

దేశీయంగా ఈవీ కార్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని మారుతి కూడా ఈ మాడళ్లను విడుదల చేయడానికి సిద్ధమైంది. వచ్చే నెలలో 17 నుంచి 22 వరకు ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో తన తొలి ఈ-విటారాను ప్రదర్శించబోతున్నట్లు తెలుస్తున్నది. 49 కిలోవాట్లు, 61 కిలోవాట్లా బ్యాటరీ సామర్థ్యంతో రూపొందించిన ఈ కారు ధర రూ.22 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. సింగిల్ చార్జింగ్‌తో 550 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.25 ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోసిస్టమ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, 360-డిగ్రీల కెమెరా వంటి ఫీచర్స్ ఉన్నాయి.

**నయా గ్రాండ్ విటారా**

కాంప్యాక్ట్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేయడానికి నయా గ్రాండ్ విటారాను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. వచ్చే ఏడాది జూన్‌లో ప్రవేశపెట్టనున్న ఈ కారును సరికొత్తగా తీర్చిదిద్దినట్లు, ముఖ్యంగా ఇంటీరియర్ డిజైనింగ్, డ్యాష్‌బోర్డ్, ఐదు-ఏడుగురు కూర్చోవడానికి విధంగా డిజైన్ చేసింది.

**కొత్త బాలెనో**

ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ బాలెనోను మరింత ఆధునీకరించి విడుదల చేయడానికి సిద్ధమైంది మారుతి. మార్చి నెలలో అందుబాటులోకి రానున్న ఈ కారులో అతిపెద్ద టచ్‌స్క్రీన్, ఫుల్ డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, సింగిల్-ప్యాన్ సన్‌రూఫ్, వైర్‌లెస్ ఫోన్ చార్జర్, టైర్-ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లతో తీర్చిదిద్దింది.

**అప్‌గ్రేడ్ బ్రెజ్జా**

మూడేండ్ల క్రితం అందుబాటులోకి తీసుకొచ్చిన బ్రెజ్జాను మళ్లీ ఆధునీకరించి మార్కెట్లో విడుదల చేయబోతున్నది సంస్థ. స్కోడా కైలాక్, కియా సైరోస్‌ల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవడానికి ఈ నయా మాడల్‌ను తెస్తున్నది.

# పెట్టుబడులపై ఫార్ములా-ఈ ఎఫెక్ట్!

### ప్రభుత్వంతో ఒప్పందాలకు జంకుతున్న పారిశ్రామికవేత్తలు
### స్నేహపూర్వక వాతావరణం లేదంటున్న ఇండస్ట్రీ వర్గాలు
### కంగారు పడుతున్న అధికారులు.. భవిష్యత్తుపై ఆందోళన

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలపై కాంగ్రెస్ సర్కారు అవలంబిస్తున్న వైఖరితో పరిశ్రమ వర్గాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. తాజాగా ఫార్ములా-ఈ రేసు ఒప్పందంపై విచారణ చేపట్టడం, కేసులు నమోదు చేయడంతో అటు పెట్టుబడిదారులు, ఇటు అధికార వర్గాలు కలత చెందుతున్నాయి. రాష్ట్రంలో ఇక ఏమాత్రం పరిశ్రమకు స్నేహపూర్వక వాతావరణం లేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది. ప్రభుత్వ వైఖరితో పరిశ్రమ భవిష్యత్తు అంధకారమయ్యే అవకాశముందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**ఇదీ సంగతి..**

సహజంగా రాష్ట్రాలు అమలు చేసే సరళీకృత విధానాలు, ప్రభుత్వాల పనితీరు, స్నేహపూర్వక వాతావరణం తదితర అంశాల ఆధారంగా పెట్టుబడులు పెట్టడం, ప్రభుత్వాలతో ఒప్పందాలు చేసుకోవడం జరుగుతుంది. పెట్టుబడిదారులు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాక నిశ్చింతగా ఆర్థిక వనరులను సమకూర్చుకోవడం, తదుపరి చర్యలు చేపట్టడం చేస్తారు. స్వతహాగానే ప్రభుత్వాలపై భరోసా ఉంటుంది కాబట్టి ధైర్యంగా వ్యాపారాలు చేసేందుకు ముందుకొస్తారు. అంతేకాదు, ప్రజాస్వామ్యంలో ఐదేండ్లకోసారి ప్రభుత్వాలు మారడం సహజ ప్రక్రియ. ఒక ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని ఆ తదుపరి వచ్చే ప్రభుత్వం కొనసాగించడం ఆనవాయితీ. దశాబ్దాలుగా ఇదే తరహా సంప్రదాయం కొనసాగుతూ వస్తున్నది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏదైనా పథకాన్ని కొనసాగించడం తదుపరి ప్రభుత్వానికి ఇష్టం లేకున్నా అప్పటికే మొదలైన పనులను పూర్తిచేసిన తరువాతే వాటిని నిలిపివేస్తారు. ఒప్పందాలు మాత్రం రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా యథావిధిగా కొనసాగించాల్సి ఉంటుంది.

**కేసులతో రచ్చ**

గడిచిన పదేండ్లలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన స్నేహపూర్వక విధానాలకు ఆకర్షితులై ఎన్నో దేశ, విదేశాలకు చెందిన కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకొని వ్యాపారాలు చేసేందుకు, పరిశ్రమలు పెట్టుకునేందుకు ముందుకొచ్చాయి. అందులో ఫార్ములా-ఈ రేస్ కూడా ఒకటి. ఢిల్లీ, ముంబైకి సైతం దక్కని ఖ్యాతిని హైదరాబాద్‌కు సాధించాలనే సంకల్పంతోపాటు కాలుష్యరహిత రవాణాను ప్రోత్సహించే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ సర్కారు ఆనాడు కార్ రేస్‌ను నిర్వహించాలని నిర్ణయించి ఒప్పందం చేసుకున్నది. ఎంతో వ్యయ ప్రయాసలతో కూడిన ఈ రేస్‌లను అర్ధాంతరంగా నిలిపివేయడంతో నిర్వాహకులు ఆర్బిట్రేషన్‌ను ఆశ్రయించారు. ఈ వ్యవహారం నడుస్తుండగానే అప్పటి మంత్రితోపాటు అధికారులపై కూడా ప్రభుత్వం కేసులు నమోదు చేయడం ఇప్పుడు సర్వత్రా చర్చకు దారితీసింది.

## ఆందోళన

గతంలో అనేక కంపెనీలు ప్రభుత్వం కల్పించే ప్రోత్సాహకాలు, ఇచ్చిన హామీలకు ఆకర్షితులై పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ఇందులో కొన్ని కంపెనీలు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించగా, మరి కొన్ని కంపెనీల వివిధ దశల్లో ఉంది. తాజాగా ప్రభుత్వం ఫార్ములా-ఈ విషయంలో తీసుకున్న నిర్ణయంతో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న కంపెనీలతోపాటు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్న కంపెనీల్లో ఆందోళన మొదలైంది. ఫార్మాసిటీ విషయంలోనూ ఇంచుమించు ఇలాగే జరిగింది. అన్ని అనుమతులూ వచ్చి పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్న ఫార్మాసిటీని రద్దు చేయడంతో అప్పటికే పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న కంపెనీలు అయోమయంలో పడ్డాయి. ఈ పరిణామాలు చూస్తుంటే ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదనే భావన సర్వత్రా కలుగుతున్నది. దీంతో ప్రభుత్వం తరపున ఒప్పందాలు చేసుకునేందుకు అధికారులు కూడా జంకుతున్నారు. ఇటీవల పలువురు ఐఏఎస్ అధికారులు సమావేశమై.. లిఖితపూర్వకంగా ఇస్తే తప్ప ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయరాదని నిర్ణయించినట్టు వార్తలు రావడం దీనికి నిదర్శనంగా చెప్పవచ్చు. ప్రభుత్వ వైఖరి ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో పరిశ్రమ భవిష్యత్తు ఎలా ఉంటుందో అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

## ఎలక్ట్రానిక్స్‌లో కోటి ఉద్యోగాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: ఉద్యోగ కల్పనలో ఎలక్ట్రానిక్స్ రంగం దూసుకుపోతున్నది. వచ్చే మూడేండ్లలో ఈ రంగంలో 1.2 కోట్ల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని టీమ్‌లీజ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. వీరిలో 30 లక్షల మంది ప్రత్యక్షంగాను, మరో 90 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయని పేర్కొంది. ప్రత్యక్షంగా ఉపాధి లభించనున్నవారిలో 10 లక్షల మంది ఇంజినీర్లు, 20 లక్షల మంది ఐటీఐ ప్రొఫెషనల్స్, 2 లక్షల మంది కృత్రిమ మేధస్సు, మెషిన్‌లెర్నింగ్, డాటా సైన్సెస్, నాన్-టెక్నికల్ విభాగానికి చెందిన 90 లక్షల మందికి ఉపాధి లభించనున్నది.

## రిలయన్స్ చేతికి కార్కినోస్

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశీయ కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థయైన ఆర్‌ఎస్‌బీవీఎల్ ..హెల్త్‌కేర్ టెక్నాలజీ సేవలను మరింత విస్తరించడంలో భాగంగా కార్కినోస్‌ను కొనుగోలు చేసింది. ఒప్పందం విలువ రూ.375 కోట్లు. జూలై 24, 2020లో ప్రారంభమైన కార్కినోస్..హెల్త్‌కేర్ టెక్నాలజీ సేవల్లో భాగంగా రోగ నిర్ధారణ, నిర్వహణ, అలాగే క్యాన్సర్‌ను ముందుగా గుర్తించే టెక్నాలజీ సేవలను అందిస్తున్నది. 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ టర్నోవర్ రూ.22 కోట్లుగా ఉన్నది. ప్రస్తుతం సంస్థ దేశవ్యాప్తంగా 60 ఆసుపత్రులతో ఒప్పందం కుదుర్చుకొని వైద్య సేవలు అందిస్తున్నది.

# టెలికం సంస్థలకు ఇక్కట్లే!




న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశీయ ప్రైవేట్ టెలికం సంస్థలకు కొత్త ఏడాదిలో ప్రధానంగా రెండు సవాళ్లు ఎదురుకావచ్చన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ ఏడాది ఆయా టెలికం కంపెనీలు టారీఫ్‌లను పెంచిన విషయం తెలిసిందే. అయితే ఇది రివర్స్ ఫైర్ అయిందన్న సంకేతాలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రధాన టెలికం సంస్థల నుంచి కస్టమర్లు ఇతర సంస్థల్లోకి మారిపోతున్నారు. దీంతో వచ్చే ఏడాదీ ఈ జంపింగ్‌లుంటాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నిజానికి ఇప్పటికే రిచార్జ్ ప్లాన్ల ధరలు తారాత్తిస్తున్నాయి. అయినప్పటికీ ఖర్చులు పెరిగాయన్న కారణాలతో టెలికం ఆపరేటర్లు ధరల భారాన్ని కస్టమర్లపై మోపుతూనే ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మధ్యలో ధరలు మరింత పెరగడంతో సబ్‌స్క్రైబర్ల సంఖ్య పెద్ద ఎత్తునే పడిపోయింది. రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాల్లో చార్జీలు 10 నుంచి 26 శాతం మేర పెరిగాయి. దీంతో ఆయా సంస్థలు 2.6 కోట్ల కస్టమర్లను కోల్పోయాయని అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. మరోవైపు దాదాపు 68 లక్షల కస్టమర్లు ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్ కనెక్షన్‌ను తీసుకున్నట్టు తేలింది. ఇప్పటికీ బీఎస్‌ఎన్‌ఎల్ 3జీ సర్వీసులనే ఇస్తుండగా, 4జీ సేవల విస్తరణ పనుల్లో ఉండటం గమనార్హం. అయినప్పటికీ కొత్త కస్టమర్లు వస్తున్నారంటే ధరల భారం ఏ స్థాయిలో ప్రైవేట్ కంపెనీలకు ప్రతికూలంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

**శాట్కామ్‌ల ఎంట్రీతో..**

వచ్చే ఏడాది శాటిలైట్ ఆధారిత సేవల సంస్థలతోనూ టెలికం కంపెనీలకు మార్కెట్‌లో భారీగానే పోటీ ఉండొచ్చన్న అంచనాలున్నాయి. ప్రధానంగా ఎలాన్ మస్క్ స్టార్‌లింక్ రాకతో ప్రస్తుతం టెలికం సంస్థలకు పెద్ద ఎత్తున ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న డాటా వ్యాపారానికి ఎదురుదెబ్బేనన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. శాట్కామ్ సర్వీసులతో ధరల యుద్ధానికి వీలుందని, డాటా ధరలు ఇంకా పడిపోవచ్చని చెప్తున్నారు. ఇదే గనుక జరిగితే ప్రైవేట్ రంగ టెలికం సంస్థలకు నష్టాలే. 5జీ సేవలను దేశవ్యాప్తంగా విస్తరిస్తూ పోతున్న టెల్కోలు.. అందుకోసం రూ.70వేల కోట్లదాకా పెట్టుబడులు పెట్టాయి.

## ఫండ్లలో మహిళా ఇన్వెస్టర్ల జోరు



న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశీయ మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీలో మహిళా పెట్టుబడిదారులు భారీగా పెరుగుతున్నారు. ప్రస్తుత సంవత్సరంలో చిన్న, మధ్యస్థాయి నగరాల నుంచి అత్యధిక మంది మహిళలు ఫండ్లలో ఇన్వెస్ట్ చేస్తున్నారని, గడిచిన ఏడాదికాలంలో వీరి సంఖ్య రెండున్నర రెట్లు పెరిగినట్లు ఆన్‌లైన్ బ్రోకరేజ్ సంస్థ గ్రోవ్ తెలిపింది. మహిళల్లో ఆర్థిక స్వావలంభన పెరుగుతున్నదని, ముఖ్యంగా పట్టణ, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలతోపాటు చిన్న స్థాయి నగరాల్లో సైతం 140 శాతం పెరిగిందని, దీంతో వీరు ఈక్విటీ మార్కెట్లతోపాటు ఎంఎఫ్ మార్కెట్లలో విరివిగా పెట్టుబడులు పెడుతున్నట్లు వెల్లడించింది. మిగతా రంగాలకు దూరంగా ఉంటున్న మహిళలు..ఈక్విటీ, ఫండ్లలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నట్లు, ఈ ఏడాది కోటి మందికి పైకి చేరుకున్నారని గ్రోవ్ కో-ఫౌండర్, సీఈవో లలిత్ కేశ్రా తెలిపారు. గడిచిన ఏడాదికాలంలో మెట్రో, టైర్-1,2,3 నగరాల్లో ఫండ్లలో పెట్టుబడులు పెట్టే మహిళలు 100 శాతం చొప్పున పెరిగారు. నగరాల వారీగా చూస్తే ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, పూణె, లక్నో, అహ్మదాబాద్, జైపూర్ వంటి మెట్రో నగరాల నుంచి అత్యధిక మంది మహిళలు మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేశారు. అలాగే పురుషుల కంటే సిప్‌లలో మహిళలు అత్యధికంగా పెట్టుబడులు పెట్టడం విశేషం. ఈ ఏడాది మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ ఏయూఎం రూ.17 లక్షల కోట్ల మేర పెరిగిందని ఆంఫీ తెలిపింది. డిసెంబర్ 2023లో రూ.50.79 లక్షల కోట్లుగా ఉన్న ఫండ్ ఆస్తుల విలువ ప్రస్తుతం రూ.68 లక్షల కోట్లకు చేరుకున్నది. అలాగే గత నెలలో దేశీయ స్టాక్ మార్కెట్లో కొత్తగా 42.76 లక్షల మంది చేరారు. అలాగే గడిచిన నాలుగేండ్లుగా ప్రతియేటా 3 కోట్ల డీమ్యాట్ ఖాతాలు ప్రారంభిస్తున్నారు.

## 4, 9న రైతుల మహా పంచాయత్‌లు

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: రైతుల ఐక్యతపై చర్చించేందుకు పంజాబ్, హర్యానాలో జనవరిలో మహా పంచాయత్‌లు నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) నిర్ణయించింది. జనవరి 4న పంజాబ్‌లోని తోహానాలో, 9న హర్యానాలోని మోగాలో మహా పంచాయత్‌లు నిర్వహించనున్నట్లు ఎస్‌కేఎం ప్రకటించింది. మహా పంచాయత్‌లో తమ సంఘం పాల్గొనబోదని భారతీయ కిసాన్ యూనియన్(క్రాంతికారి) ప్రధాన కార్యదర్శి సుఖ్వీందర్ కౌర్ ప్రకటించారు.

### జనాలు చనిపోతే సినిమాపై ఏం మాట్లాడతాం

- సంధ్య థియేటర్ ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్




హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): 'ఇక్కడ జనాలు చనిపోతే సినిమాల గురించి ఏం మాట్లాడతాం..' అంటూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సంధ్య థియేటర్ ఘటనపై స్పందించారు. కడప జిల్లా పర్యటన అనంతరం మీడియాతో మాట్లాడుతుండగా సంధ్య థియేటర్ ఘటన, అల్లు అర్జున్ అరెస్ట్‌పై ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ 'సినిమాల గురించి కాకుండా ప్రజా సమస్యలపై చర్చపెట్టండి' అని పేర్కొన్నారు. ప్రస్తుతం పవన్ మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

### 324 చ.కి.మీ.తో మూడో ముంబై

ముంబై, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): ముంబై, నవీ ముంబైని తలదన్నేలా మూడో ముంబై రూపుదిద్దుకోనున్నది. ఈ మేరకు మహారాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. నవీ ముంబై సమీపంలోని రాయగఢ్‌లో 324 చదరపు కిలోమీటర్లలో ఈ మహా నగరాన్ని నిర్మించనున్నామని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రకటించారు. 2025లో సర్వే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. సకల హంగులతో నిర్మించనున్న ఈ సిటీకి కర్నల్‌సాయి చిర్నార్‌గా నామకరణం చేశామన్నారు. పెరిగిన జనాభాతో దేశ వాణిజ్య రాజధానిపై ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో ఈ నగర నిర్మాణానికి పూనుకున్నామని చెప్పారు. గుట్టలు, చెట్ల మధ్య ఉన్న ప్రాంతం ఆహ్లాదానికి నెలవుగా ఉంటుందన్నారు.

# తండ్రి ప్రతిరూపం సాక్షిగా కూతురు పెళ్లి..!

- రూ.4 లక్షలతో తండ్రి విగ్రహం తయారు చేయించిన కూతురు
- పెళ్లి జరుగుతున్నంతసేపూ మండపంపైనే ఉంచి మురిసిపోయిన బిడ్డ



కొత్తగూడెంలో తండ్రి విగ్రహంతో నూతన వధూవరులు

*కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 28 : తండ్రి ఈ లోకంలో లేకపోయినా.. ఆయన ప్రతిరూపం సాక్షిగా కూతురు పెళ్లి చేసుకున్న ఘటన కొత్తగూడెంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కొత్తగూడెం హెడ్డాఫీస్ ఐటీ విభాగంలో డీజీఎంగా పని చేస్తున్న బాలరాజు 2019లో అనారోగ్యంతో మృతి చెందారు. అతడికి కుమారుడు, కూతురు ఉన్నారు. బాలరాజు ఉద్యోగాన్ని తన కూతురు స్నేహకు ఇచ్చారు. శుక్రవారం రాత్రి కొత్తగూడెంలోని కేసీవోఏ క్లబ్‌లో స్నేహ పెళ్లి సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలో అండర్ మేనేజర్‌గా పనిచేస్తున్న అవినాష్‌తో జరిగింది. పెండ్లి కూతురు స్నేహ తన తండ్రి తమతో ఉండాలనే ఉద్దేశంతో రూ.4 లక్షలతో ఆయన విగ్రహాన్ని తయారు చేయించి వీల్‌చైర్‌లో కూర్చోబెట్టి వివాహ వేడుక జరిగేంత వరకు మంటపంలో ఉంచింది. తండ్రి కళ్ల ముందే పెళ్లి జరుగుతున్నదని స్నేహ మురిసిపోయింది. అచ్చం మనిషిలా ఉండే ప్రతిమను తయారు చేయించి తీసుకురావడంతో అందరూ ఫొటోలు దిగారు. బంధుమిత్రులు, సన్నిహితులు శనివారం స్నేహ ఇంటికి వెళ్లి విగ్రహాన్ని చూసి హర్షం వ్యక్తంచేశారు.*


## మైనర్ పాస్‌పోర్ట్‌కు ఒకరి సంతకం చాలు

- హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): మైనర్ పిల్లల పాస్‌పోర్ట్ జారీకి తల్లిదండ్రులు ఇద్దరి సంతకాలు అవసరంలేదని, వారిద్దరిలో ఏ ఒక్కరి సంతకం ఉన్నా సరిపోతుందని హైకోర్టు స్పష్టం చేసింది. చట్ట ప్రకారం మైనర్ పిల్లలు రక్షణలో ఉన్న సింగిల్ పేరెంట్ సంతకంతో జారీ చేవయచ్చని వెల్లడించింది. తండ్రి సంతకం లేకుండా పాస్‌పోర్ట్ జారీ చేయడానికి నిరాకరించడాన్ని సవాలు చేస్తూ నాలుగేండ్ల జైనాబ్ ఆలియా మహమ్మద్ అనే బాలిక హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై జస్టిస్ మౌసమీ భట్టాచార్య విచారణ జరిపి తీర్పు వెలువరించారు. మైనర్ పిల్లలకు సింగిల్ పేరెంట్ దరఖాస్తు చేయరాదని 1967 పాస్‌పోర్ట్ చట్టంలో కానీ, 1980 నిబంధనల్లో గానీ ఎక్కడా నిషేధం లేదని అన్నారు. మైనర్ పిల్లలు ప్రత్యేక కస్టడీలో ఉన్నప్పుడు సింగిల్ పేరెంట్ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తును తిరస్కరించడం రాజ్యాంగం ప్రసాదించిన హక్కులకు విరుద్ధమని అన్నారు. ప్రస్తుత కేసులో భర్త అందుబాటులో లేరని, అంతేగాకుండా పిటిషనర్ తల్లిపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని చెప్పారు. బాలిక తల్లి రక్షణలోనే ఉన్నదని, అందువల్ల తండ్రి సంతకంతో నిమిత్తం లేకుండా పాస్‌పోర్ట్ జారీచేయాలని ఆదేశించారు.

## మీపై కేసుల దశ ఏమిటి?

### ఎంపీ రఘునందన్‌రావును ప్రశ్నించిన హైకోర్టు



హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): తనపై వివిధ సందర్భాల్లో నమోదైన క్రిమినల్ కేసుల విచారణ ఏ దశలో ఉన్నదో వివరాలు సమర్పించాలని బీజేపీ మెదక్ ఎంపీ ఎం రఘునందన్‌రావును హైకోర్టు ఆదేశించింది. రఘునందన్‌రావుకు పాస్‌పోర్ట్ నిరాకరణపై కౌంటరు దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి, ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారికి నోటీసులు ఇచ్చింది. క్రిమినల్ కేసులున్నాయని చెప్పి తన పాస్‌పోర్ట్‌ను రెన్యూవల్ చేయకపోవడం అన్యాయమని పేర్కొంటూ రఘునందన్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ మౌసమీ భట్టాచార్య ఇటీవల విచారణ జరిపారు. పాస్‌పోర్ట్‌ను రెన్యూవల్ చేయకపోవడం చట్టవిరుద్ధమని పిటిషనర్ తరపు న్యాయవాది అన్నారు. క్రిమినల్ కేసు ఉన్నంత మాత్రాన పాస్‌పోర్ట్ నిరాకరించేందుకు లేదని తెలిపారు. ప్రభుత్వం తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఎన్నికల సంఘంతోపాటు జూన్ 4న పాస్‌పోర్ట్ అధికారులకు తనపై ఉన్న కేసుల జాబితాను పిటిషనర్ స్వయంగా అందజేశారని చెప్పారు. పిటిషనర్‌పై క్రిమినల్ కేసులు ఉన్నందున పాస్‌పోర్ట్ రెన్యూవల్ నిలుపుదల సబబేనని చెప్పారు. ఇరుపక్షాల వివరణ కోరిన హైకోర్టు, తదుపరి విచారణను జనవరి 7కి వాయిదా వేసింది.

## ప్రభుత్వానికి సీతారామ టెండర్లు!



హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టులోని పలు ప్యాకేజీల టెండర్లపై నిర్ణయాన్ని ప్రభుత్వమే తీసుకోవాలని కమిషర్ ఆఫ్ టెండర్స్(సీవోటీ) నిర్ణయించింది. సాగునీటి పారుదలశాఖ ఈఎన్సీ అనిల్‌కుమార్ నేతృత్వంలో శనివారం సీవోటీ సమావేశం జరిగింది. సీతారామ ప్రాజెక్టు పెండింగ్ డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీ పనులు చేపట్టాలని గతంలోనే నిర్ణయించగా టెండర్లపై సీవోటీలో చర్చించారు. తుదిఆమోదం కోసం టెండర్లను ప్రభుత్వానికే పంపించాలని సీవోటీ నిర్ణయించింది. మరిన్ని ప్రాజెక్టుల టెంబర్లపైనా చర్చించి, వాటిని కూడా ప్రభుత్వానికే పంపాలని నిర్ణయించినట్టుగా తెలిసింది.

### భద్రకాళి చెరువు పూడికతీతకు మార్గదర్శకాలు

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): వరంగల్ భద్రకాళి చెరువులో పూడికతీతకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. రూ.11.16 కోట్లతో పూడికతీత, తరలింపు, సమాచార నిర్వహణ బాధ్యతను వరంగల్ సీఈకి అప్పగించింది. రెవెన్యూ అధికారులతో కలిసి పనులను నిర్వహించాలని ఆదేశించింది. పూడికతీత ఫొటోలు తీయాలని సూచించింది.



## ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యం

- లక్ష టన్నుల ఎగుమతికి అంగీకారం
- జనవరి నెలాఖరుకు 40 వేల టన్నుల సరఫరా

హైదరాబాద్, డిసెంబర్ 28(నమస్తే తెలంగాణ): మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయం రంగంలో తీసుకొచ్చిన సంక్షేమ ఫలాలు దేశ ప్రజల ఆకలినే కాదు, విదేశీయుల ఆకలిని సైతం తీర్చుతున్నాయి. ఈ మేరకు తెలంగాణ బియ్యం ఫిలిప్పీన్స్‌కు ఎగుమతి కానున్నాయి. ఇందుకు సంబంధించి పౌరసరఫరాల సంస్థతో ఫిలిప్పీన్స్‌కు లక్ష టన్నుల బియ్యం సరఫరాకు ఒప్పందం కుదుర్చుకున్నది. శుక్రవారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఆ దేశ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లక్ష టన్నుల బియ్యం సరఫరాకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా తొలి దశలో జనవరి నెలాఖరు నాటికి 40 వేల టన్నుల బియ్యం సరఫరా చేసేందుకు పౌరసరఫరాల సంస్థ చర్యలు చేపట్టింది. కొన్నేండ్లుగా రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి భారీగా పెరిగింది. 2014లో 70 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, ఇప్పుడు అది 2.5 కోట్ల టన్నులకు చేరింది. ఎఫ్‌సీఐకి సకాలంలో సీఎమ్మార్ ఇవ్వలేని పరిస్థితి నెలకొన్నది. దీంతో మిల్లుల్లో టన్నుల కొద్ది ధాన్యం పేరుకుపోతున్నది. ఈ పరిస్థితుల్లో ఎఫ్‌సీఐకి ఇవ్వగా మిగిలిన బియ్యాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు సివిల్ సప్లయ్ కొద్దిరోజులుగా కసరత్తు చేస్తున్నది. ప్రభుత్వం ఇప్పటికే 38 లక్షల టన్నుల ధాన్యాన్ని వేలం ద్వారా విక్రయించగా, మిగిలిన ధాన్యాన్ని విదేశాలకు సరఫరా చేసి ఆదాయాన్ని సమకూర్చుకోవాలని భావిస్తున్నది.


## భోజన విరామంలో పుస్తకాల వేట

- ముంబై బుక్ స్టాల్‌తో మన్మోహన్‌కు ప్రత్యేక అనుబంధం

ముంబై, డిసెంబర్ 28: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ప్రతిరోజూ పుస్తకాలు చదవడం అలవాటు. ఆఖరుకు భోజన విరామ సమయంలోనూ ఆయన పుస్తకాల వేటలోనే ఉండేవారు. పుస్తకాల కోసం ఆయన ఎంతలా ఆసక్తి కనబరిచేవారో ముంబైలోని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రం స్ట్రాండ్ బుక్ స్టాల్ సిబ్బంది గుర్తు చేసుకున్నారు. 1982 నుంచి 1985 మధ్యకాలంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్‌గా మన్మోహన్ సింగ్ పని చేశారు. ఈ సమయంలో ఆయన తరచూ ఫోర్ట్ ఏరియాలోని స్ట్రాండ్ బుక్ స్టాల్‌కు వెళ్లేవారు. ఎక్కువగా మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఆయన తమ దుకాణానికి వచ్చే వారని అప్పట్లో అందులో పని చేసిన జగత్ అనే వ్యక్తి చెప్పారు. సూట్ లేదా కుర్తా పైజామా ధరించి వచ్చేవారని, చాలా సున్నితంగా మాట్లాడేవారని, నిరాడంబరంగా ఉండేవారని గుర్తు చేసుకున్నారు. ఎక్కువగా మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, ఆర్థిక శాస్త్రానికి సంబంధించిన పుస్తకాలను మన్మోహన్ సింగ్ అడిగేవారని చెప్పారు.

## ఆప్ కట్టడికి కాంగ్రెస్, బీజేపీ పన్నాగం

- కేజ్రీవాల్ ఆరోపణ



న్యూఢిల్లీ: ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ శనివారం కాంగ్రెస్, బీజేపీలపై తీవ్రంగా మండిపడ్డారు. ఆప్ ప్రతిపాదిత సంక్షేమ పథకాలపై కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ ఫిర్యాదుపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ దర్యాప్తునకు ఆదేశించిన నేపథ్యంలో కేజ్రీవాల్ ఘాటుగా స్పందించారు. విలేకరుల సమావేశంలో కేజ్రీవాల్ మాట్లాడుతూ, ఢిల్లీ శాసన సభ ఎన్నికలకు ముందు మహిళలు, వృద్ధుల కోసం ఆప్ ప్రతిపాదించిన మహిళా సమ్మాన్ యోజన, సంజీవని యోజన పథకాలను ఆపడానికి కాంగ్రెస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయని దుయ్యబట్టారు. మహిళా సమ్మాన్ యోజన పేరుతో మహిళల వ్యక్తిగత వివరాలను ప్రైవేట్ వ్యక్తులు సేకరిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుపై లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా దర్యాప్తునకు ఆదేశించడంపై కేజ్రీవాల్ ఈ విధంగా స్పందించారు.

## ఐపీఎస్ ఐఐటీ పీహెచ్‌డీ రద్దు

- రేప్ చేసినట్టు రీసెర్చ్ స్కాలర్ ఫిర్యాదు

కాన్పూర్: ఐపీఎస్ అధికారి మహమ్మద్ మొహిసిన్‌ఖాన్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ను ఐఐటీ-కాన్పూర్ రద్దు చేసింది. ఆయన ఐఐటీ-కే పరిశోధక విద్యార్థిని (26)పై లైంగిక దాడి చేసినట్లు ఫిర్యాదు రావడంతో ఈ చర్య తీసుకుంది. తనను వివాహం చేసుకుంటానని మహమ్మద్ మోసం చేశాడని బాధితురాలు ఆరోపించారు. బాధితురాలి ఫిర్యాదుపై దర్యాప్తునకు పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. 48 గంటల్లోగా తన వాదనను వినిపించాలని మహమ్మద్‌ను సిట్ కోరింది. మహమ్మద్ గతంలో కాన్పూర్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్‌గా పని చేశారు.

### పీఎస్‌ఎల్వీ-సీ60 ప్రయోగానికి నేడు కౌంట్ డౌన్

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలోని షార్ నుంచి పీఎస్‌ఎల్వీ-సీ60 ప్రయోగానికి ఆదివారం నుంచి కౌంట్ డౌన్ ప్రారంభం కానుంది. ప్రయోగానికి 25 గంటల ముందు అంటే రాత్రి 8.58 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. రాకెట్ నాలుగు దశలతో పాటు ఉపగ్రహాల అనుసంధాన పనులను పూర్తి చేశారు. ఈ రాకెట్ ద్వారా స్పేస్ డాకింగ్‌కు చెందిన స్పాడెక్స్ జంట ఉపగ్రహాలను ఇస్రో రోదసిలోకి పంపనుంది.

### ఆ వార్తలు అవాస్తవం

- ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు
- తెలంగాణ సిఫారసు లేఖలపై టీటీడీ ఈవో క్లారిటీ

హైదరాబాద్, డిసెంబర్ 28(నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారి దర్శనానికి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖల స్వీకరణపై వస్తున్న వార్తలన్నీ అవాస్తవమని టీటీడీ ఈవో శ్యామలారావు పేర్కొన్నారు. ఈ అంశంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, సోషల్ మీడియాలో వచ్చిన వార్తలు వదంతులేనని, భక్తులెవరూ నమ్మొద్దని వెల్లడించారు. వారానికి రెండురోజులు తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫారసు లేఖలను అనుమతిస్తున్నట్టు గత రెండ్రోజులుగా వార్తలు వైరల్ అయ్యాయి. కాగా, శ్రీవారి దర్శనానికి సిఫారసు లేఖలను అనుమతించకపోవటంపై గత కొన్నిరోజులుగా తెలంగాణ ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్న విషయం తెలిసిందే.